క్లుప్తంగా

నారాయణపురం ప్రభుత్వ కళాశాల విద్యార్థికి జేఎన్‌టీయూలో సీటు


వడలి నిర్మల్

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన వడలి నిర్మల్‌కు విజయనగరం జేఎన్‌టీయూ కళాశాలలో ఇంజనీరింగు సీటు లభించింది. గతేడాది ఈ కళాశాలలో నిర్మల్ ఇంటర్ చదివాడు. ఈ విద్యార్థి ఇంజనీరింగు సెట్‌లో సత్తాచాటి జేఎన్‌టీయూలో మెకానికల్ సీటు సాధించాడు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు ఆ విద్యార్థిని అభినందించారు.

ఎంఈవో-2 శ్రీనివాసరావు ఆదర్శనీయుడు

ఉంగుటూరు: మండల విద్యాశాఖాధికారిగా శ్రీనివాసరావు పనితీరు ప్రశంసనీయమైనదని తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి ఉపవిద్యాశాఖాధికారి నిమ్మగడ్డ రవీంద్రభారతి అన్నారు. ఆదివారం శ్రీనివాసరావు ఎంఈవో- 2గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంలో నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఉపాధ్యాయులు ప్రజలు ఏర్పాటు చేసిన సన్మాన సభలో రవీంద్రభారతి మాట్లాడుతూ శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ నిజాయతీ శ్రీనివాసరావు పనిచేశారని కొనియాడారు. సన్మాన గ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ అభిమానం చూపించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరిండెంటు ఆంజనేయబాబు, రిటైర్డు ఈవోపీఆర్డీ షంషుద్దీన్, సర్పంచి దిడ్ల అలకానంద, బీజేపీ మండల అధ్యక్షురాలు అడపా శోభారాణి, యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆలీ, రవికుమార్, వివిధ మండలాల విద్యాశాఖాధికార్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలాయగూడెంలో కొట్లాట

దెందులూరు: గాలాయగూడెంలో రెండు కుటుంబాల మధ్య సీసీ కెమెరాకు సంబంధించి ఘర్షణ, కొట్లాట ఆదివారం జరిగింది. ఈ సంఘటనలో ఇరు కుటుంబ సభ్యులు గాయపడటంతో వైద్యచికిత్స నిమిత్తం ఏలూరు వైద్యశాలకు తీసుకెళ్లారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

గణపవరం : పదవీవిరమణ ఉద్యోగానికే తప్ప మనస్సుకు కాదని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఎంఈవో కె.రాంబాబు, మాజీ ఎంఈవోలు వి.నర్సింహమూర్తి, పాశం పాండురంగారావు అన్నారు. ఆదివారం గణపవరంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో బావాయిపాలెం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల సహాయోపాధ్యాయునిగా పనిచేసి పదవీవిరమణ చేసిన నర్సింహమూర్తి సన్మాన సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హెచ్ఎం కసిరెడ్డి హరనాథ్ అధ్యక్షత వహించారు. ఈసభలో వారు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా హైస్కూలు ఉపాధ్యాయులు నర్సింహమూర్తిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ముత్యాల రామసుబ్బారావు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల ప్రకాష్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంగావలి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల పరిశీలన

పెదపాడు: సాగునీటి కష్టాలు తొలగించి రైతాంగానికి అండగా ఉంటామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రైతులకు భరోసా ఇచ్చారు. పెదపాడు మండలంలోని వసంతవాడ, తోటగూడెం గ్రామాల మధ్యలో కాలువ పరిస్థితులను ఆదివారం పరిశీలించారు. వసంతవాడ నుంచి తోటగూడెం వరకు తూములు అధ్వాన్న స్థితిలో ఉండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ స్థానిక రైతులు ఎమ్మెల్యే చింతమనేని దృష్టికి తీసుకువచ్చారు. సత్వరమే కేఈ కెనాల మరమ్మతులు చేపట్టాలని గుర్రపు డెక్క సహా పలు అవాంతరాలను తొలగించాలని అధికారులకు ఆయన ఫోన్‌లో సూచించారు. కేఈ కెనాల్‌కు 4 రోజుల పాటు నీటి సరఫరా నిలుపుదల చేస్తారని. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. కేఈ కెనాల్‌కు ఆయకట్టు చివర భాగమైన సీతంపేట కెనాల్, ఏలూరు రూరల్, పెదపాడు ఆయకట్టులోని ప్రాంతాల రైతులు సాగునీటి కొరతతో సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తా అనీల్ పాల్గొన్నారు.

105 మందికి వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో ఏలూరు లైన్స్ క్లబ్ విజన్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌వీఎస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు పీఆర్‌వీ ప్రవీణ్ కుమార్, నాగ రామకృష్ణ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ వేమా కోటేశ్వరరావు ప్రారంభించారు. 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లవల్లి చలపతి రావు, కార్యదర్శి కంది బాలకృష్ణ, కోశాధికారి తమ్మన సాయి కృష్ణ సుహాస్ పాల్గొన్నారు.

విద్యా లక్ష్యాలకు తూట్లు

- కూటమి ప్రభుత్వంలో విద్యారంగానికి కొరవడిన ప్రాధాన్యత
- పథకాల అమలుపై నిర్లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ హయాంలో అధిక నిధుల కేటాయింపు


ఉంగుటూరు మండలంలోని పాఠశాల భవనాలు

దెందులూరు: ప్రభుత్వ బడుల్లో చదువులు ప్రస్తుతం గాడి తప్పాయి. విద్యార్థులందరికీ యూనిఫాం, బూట్లు పూర్తిస్థాయిలో అందలేదు. కొన్ని స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. పాఠశాలల్లో వడ్డించే మధ్యాహ్న భోజనం రుచి తగ్గడంతో విద్యార్థులందరూ తినడం లేదు. గత ప్రభుత్వంలో వివక్ష లేకుండా విద్యార్థులందరికీ విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

దెందులూరు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో స్టూడెంట్స్ కిట్లు, పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో విద్యార్థులకు పంపిణీ కాలేదు. మండల, డివిజన్, జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడటం, పాఠశాల హెచ్ఎం, అసిస్టెంట్ ఇంజనీర్, ఎంపీడీఓల సమన్వయం లోపించడం కారణంగా ఈ పరిస్థితి నెలకొంది.

నవ సమాజ నిర్మాణానికి విద్యే పునాది

ప్రతి చిన్నారీ బడికి వెళ్లాలి, విద్యనభ్యసించాలి తద్వారా ఆ కుటుంబం, గ్రామం అభివృద్ధి చెందాలి. ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలన్న దూరదృష్టితో నవ సమాజం నిర్మాణానికి విద్యే పునాదిగా భావించిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చించారు. ఆయన చేసిన ఆలోచనల కారణంగా గ్రామాల్లో పాఠశాలలు రూపురేఖలు మారాయి. గతంలో ఎన్నడూ చూడని ఆధునిక సౌకర్యాలు, మౌలిక వసతులు ఏర్పడ్డాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్య దేశానికి ఆదర్శంగా నిలిచింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యనందించాలన్న ఉన్నత లక్ష్యానికి తూట్లు పొడిచేలా నిర్ణయాలు తీసుకుంటోంది.

మారిన మెనూతో ఇబ్బందులు



గత ప్రభుత్వంలో రుచికరమైన ఆహార పదార్థాలను వండి విద్యార్థులకు అందించేవారు. ప్రతి ఒక్క విద్యార్థి మనస్ఫూర్తిగా ఎంతో ఇష్టంగా ఆహారాన్ని భుజించడం జరిగేది. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనం మెనూ మార్చడం జరిగింది. కొత్త మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్న ఆహార పదార్థాలను తినాలంటే విద్యార్థులు అయిష్టంగా ఉంటున్నారు. కొంతమంది విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి క్యారియర్లు తీసుకువచ్చి భోజనాన్ని తింటున్నారు. విద్యార్థులకు ఇష్టమైన విధంగా పోష్టికాహారాన్ని అందించే సదుద్దేశంతో కొత్త మెనూ మార్చాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం



దెందులూరు మండలం పరిధిలోని పాఠశాలల్లో పథకాలు సక్రమంగా అమలయ్యేలా ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నాం. పర్యవేక్షణ రోజువారీ దినచర్యగా మారింది. హెచ్ఎం, అసిస్టెంట్ ఇంజనీర్, ఎంఈఓ గ్రూపుగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన కిట్లు, పుస్తకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నాం.

– కె.అన్నమ్మ, దెందులూరు ఎంఈఓ–2

లక్ష్యాలు పూర్తి చేయాల్సిందే



ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నిధులు మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. పథకాల అమలుపై హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అలక్ష్యం చేయవద్దని సూచించాం. విద్యాప్రమాణాల మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– సబ్బితి నర్సింహమూర్తి, పెదపాడు ఎంఈఓ

మౌలిక వసతులు కల్పించాలి



విద్యార్థులకు పూర్తిస్థాయిలో కిట్లు అందించాలి. పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలి. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు పూర్తి చేయకపోవడం బాధాకరం. పేద విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసిస్తారు. కూటమి ప్రభుత్వ పాలకులు, అధికారులు బడిలో విద్యనభ్యసించే విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయరాదు.

– కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి


పిప్పరలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

గణపవరం: కేరళలోని వయోనాడ్‌లో జరిగిన విపత్తులో బాధితులకు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పరలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజల నుంచి వయోనాడ్ బాధితులకు ఆర్థిక సహాయం అందించాలంటూ విరాళాలు సేకరించారు. విరాళాలు స్వీకరించి బాధితులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.గోవింద్, పి.నర్సింహమూర్తి, సంజీవరావు, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీ ఏర్పాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన అన్ని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కలిపి సిద్ధాంత బేధాలు లేకుండా ఉండేందుకు నూతనంగా సిటీ పాస్టర్స్ అసెంబ్లీగా ఏర్పడినట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం గవరవరంలోని ఫ్రెండ్స్ ఆఫ్ గాడ్ చర్చిలో సమావేశమై సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంస్థ చీఫ్ ప్యాట్రన్‌గా బిషప్ కారుపాటి శాంతి సాగర్, బిషప్ జి.సుభద్ర రావు, పి.జీవన్ కుమార్ ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా కె.సుదర్శన్‌బాబు, కార్యదర్శిగా ఇ.రత్న ప్రసాద్, కోశాధికారిగా జోసఫ్ చిక్కాల, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

జాతీయ అవార్డు బాధ్యతను పెంచింది


సీఆర్‌డీపీ అధికార సొంగా రవీంద్రప్రసాద్

దెందులూరు: తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 30 వేల మందికి రక్తాన్ని దాతల సహకారంతో అందించామని, రక్తదానంలో విశేష కృషిని గుర్తించి తనకు జాతీయ అవార్డు, బంగారు నంది ప్రదానం చేశారని, ఈ అవార్డులు మరింత బాధ్యత పెంచిందని ఏపీ సీఆర్‌డీపీ డివిజనల్ అధికారి సొంగా రవీంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం నాగన్నగూడెం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనప్పటికీ ఎటువంటి సమస్య ఉన్నా రక్తం కావాల్సి వస్తే తనను లేదా వాట్సాప్‌లో ఏర్పాటు చేసిన బ్లడ్ గ్రూపుల్లో సమాచారం ఇస్తే గంటలోపే వారికి రక్తం సరఫరా చేస్తామన్నారు. ఒకవైపు సీఆర్‌డీపీ డివిజనల్ అధికారి విధులు నిర్వహిస్తేనే సామాజిక సేవా దృక్పథంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో అవసరమైన వారికి దాతల సహకారంతో రక్తాన్ని అందిస్తున్నామన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని దీనిపై యువకులను చైతన్యవంతం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తన విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ రవీంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానం


భీమడోలు లైబ్రరీలో చిన్నారులకు గ్రంథాలయం ఆవశ్యకతను వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. తొలుత ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ తోటి స్నేహితులకు రాఖీలు కట్టారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ, ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వర్గీకరణతో దళితులకు అన్యాయం


జల్లికాకినాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎఐఎం సభ్యులు

గణపవరం: వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దళితుల అభ్యున్నతికి ఏమాత్రం ఉపయోగపడదని, దళితుల అణచివేతకు మాత్రమే వర్గీకరణ దోహదపడుతుందని అంబేద్కర్ ఇండియా మిషన్ సభ్యులు అన్నారు. ఆదివారం ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎం సభ్యులు బి.నాగేశ్వరరావు, బళ్లారి అశోక్ మాట్లాడుతూ సుప్రీం తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా ఉందన్నారు. సీనియర్ నాయకుడు కట్టూరి ప్రసాద్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయి కృష్ణ, జీవన్‌కుమార్, చినముత్యాలు, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

శాకంబరిగా నూకాలమ్మ దర్శనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాసం అమావాస్య, ఆదివారం సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలను ప్రారంభించారు. 324 మంది మహిళలు 108 రకాల పండ్లు, పిండి వంటలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి పుట్టింటి సారెగా సమర్పించారు

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


తల్లి పాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న దెందులూరు సూపర్‌వైజర్ చిట్టెమ్మ

దెందులూరు: బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని బాలింతలు, వైద్యశాఖ సలహాలు, సూచనలు పాటించాలని దెందులూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ అన్నారు. దెందులూరు సెక్టార్–1 పరిధిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బాలింతలకు అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాఖ సిబ్బంది శాఖాపరమైన సూచనలు సుదీర్ఘంగా వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు రంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఉన్నారు.

రిటైర్డ్ జవాన్‌కు ఘన సన్మానం


రిటైర్డ్ ఆర్మీ జవానును సన్మానిస్తున్న ఎక్స్ పారామిలిటరీ అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సెంట్రల్ పారామిలిటరీ ఫోర్సెస్‌లో 22 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని అస్సాం రాష్ట్రంలోని సిల్చార్‌లో గత నెల 31న పదవీ విరమణ చేసి ఆదివారం తన సొంత ప్రాంతమైన ఏలూరు నగరానికి విచ్చేసిన మెరుగుమాల వీరాస్వామికి ఘన స్వాగతం లభించింది. ఎక్స్ పారామిలిటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వీరాస్వామి సీఆర్‌పీఎఫ్‌లో 22 సంవత్సరాలు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. ఆయన సేవలు ఏలూరు నగర ప్రజలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సోమవరపాటి శ్రీనివాస్, పోలిశెట్టి సత్యనారాయణ, పూజారి రామారావు, చింతాడ కామేశ్వరరావు, శంకరపు ముత్యాల రావు, సత్తుపతి శామ్యూల్, సరీ్వసు పర్సన్ కె.బాబూరావు పాల్గొన్నారు.

ప్రజాభిమానాన్ని మించిన అవార్డులు లేవు


తహసీల్దార్ అల్లాడి రమణ పదవీ విరమణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు ప్రజల మదిలో కలకాలం గుర్తుంటారని, వారి అభిమానానికి మించిన అవార్డులు లేవని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో సుదీర్ఘ కాలం రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి తహసీల్దార్‌గా పదవీ విరమణ చేసిన అల్లాడి వెంకట రమణారావు సన్మాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన పదవీకాలంలో నియోజకవర్గంలో తహసీల్దార్‌గా పనిచేసి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేశారని గుర్తు చేశారు. ఏలూరు ఆర్డీవో ఖాజావలి మాట్లాడుతూ తహసీల్దార్‌గా రమణ అందించిన సేవలు అభినందనీయమని అన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రజలు, అన్నిశాఖల ఉద్యోగులు ఇళ్లకే పరిమితమైతే రెవెన్యూ శాఖ ఉద్యోగులు మాత్రమే ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడడానికి రేయింబవళ్లు పనిచేశారని గుర్తుచేశారు. కరోనా కాలంలో తహసీల్దార్‌గా రమణారావు అందించిన సేవలు మరువలేనివన్నారు. సమావేశంలో పలువురు రెవెన్యూ శాఖ ఉద్యోగులు, విశ్రాంత తహసీల్దార్లు మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుబాబు తహసీల్దార్ రమణారావు దంపతులను దుశ్శాలువతో, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులు రమణారావు దంపతులను పూలమాలలతో సత్కరించారు.

స్నేహ బంధం... శాశ్వతం


భీమడోలు ఉన్నత పాఠశాలలో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

భీమడోలు: మండలంలోని గ్రామాల్లో స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆగస్టులో వచ్చే మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక, కురెళ్లగూడెం, ఎంఎంపురం గ్రామాల్లోని చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒక చోటకు చేరి తాము చదువుకున్న రోజులను నెమరవేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వారంతా సరదాగా గడిపి సందడి చేసారు. స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం అనే వారంతా ఒకరినొకరు పలకరించుకుంటూ అప్యాయతానురాగాలను పంచుకున్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–01 టెన్త్ విద్యార్థులంతా నాడు- నేడు పథకంలో నిర్మించిన నూతన భవనం వద్దకు చేరి స్నేహితుల దినోత్సవాన్ని ఉల్లాసంగా గడిపారు. వారంతా కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. చిన్నపిల్లల మాదిరిగా వారంతా సందడి చేశారు. వారంతా ఫ్రెండ్‌షిప్ బ్యాండులను కట్టుకుని ఆటపాటలల్లో మునిగి తేలారు. పేద, ధనిక, కుల, మత బేధం లేని బంధుత్వం కన్నా గొప్పది స్నేహమంటూ వారంతా ముక్తకంఠంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంటు కోత... ఉక్కపోత

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రోజూ గంటన్నర కరెంటు కోత విధిస్తున్నారు. కారణాలు ఏమైనప్పటికీ అప్రకటిత అనధికారిక కరెంటు కోత వల్ల గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాయంత్రం అధికంగా రాత్రివేళల్లో కరెంటు కోతల వల్ల గృహ వినియోగదారులు, వైద్యశాల సిబ్బంది తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రతిరోజూ గంట నుంచి గంటన్నర వరకూ కరెంటు కోత విధిస్తే జనవరి నుంచి జూన్ వరకు ఎన్ని గంటలు కరెంటు కోత ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు, ఉన్నతాధికారులు గ్రామాల్లో కరెంటు కోత విధించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కాలిబాట వంతెనకు కష్టకాలం


కాలిబాట వంతెనపై నిలిచిన వర్షం నీరు


కాలిబాట వంతెన పైకి వెళ్లే ప్రదేశంలో అపరిశుభ్రత


శిథిలమైన కాలిబాటవంతెన రైలింగ్

గణపవరం: గణపవరం వెంకయ్య కాలువపై వెలంపేట వద్ద మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన కాలిబాట వంతెనకు అధికారుల నిర్లక్ష్యంతో కష్టకాలం దాపురించింది. ఇప్పటికైనా ఈవంతెన నిర్వహణ పట్టించుకోక పోతే అనతికాలంలోనే వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గణపవరంలో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని 1990లో అప్పటి అత్తిలి శాసన సభ్యుడు దండు శివరామరాజు కృషితో వెలంపేట వద్ద వెంకయ్య వయ్యేరుపై ఈ కాలిబాట వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మించిన తర్వాత గణపవరంలో చాలావరకూ ట్రాఫిక్ సమస్య తగ్గింది. ఆకివీడు, పెద కాపవరం, చినకాపవరం, బావాయిపాలెం, చానమిల్లి, సిద్ధాపురం క్రొవ్విడి, గొల్లగూడెం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు గణపవరం సెంటర్‌కు రాకుండా ఈవంతెన మీదుగా ఆయా గ్రామాలకు వెళుతున్నారు. దీనితో గణపవరం సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీ కొంత వరకూ తగ్గింది. గణపవరం బొబ్బిలి వంతెన మీద, పోలీస్ ఐలెండ్ దగ్గర, వంతెన దిగువున ఆకివీడు రోడ్డు కూడలి వద్ద ట్రాఫిక్ స్తంభించిన సందర్భాల్లో సైక్లిస్టులు, స్కూటరిస్టులు, పాదచారులు ఈ వంతెన మీదుగా ట్రాఫిక్ వలయంలో చిక్కుకోకుండా ఈ వంతెన మీదుగా ప్రయాణాలు సాగిస్తుంటారు. గణపవరం, సరిపల్లె, చినరామచంద్రపురం గ్రామాల రైతులు తమ పొలాలకు వెళ్లడానికి ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన ఈవంతెన నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాని మనుగడకే ముప్పు కలుగుతుంది. కొన్నేళ్లుగా వంతెన సిమెంట్ రైలింగ్ విరిగిపోయి ఇనుప ఊచలు బయటకు పొడుచుకువచ్చి ప్రమాదభరితంగా ఉన్నాయి. వంతెన శ్లాబు గోతులు పడి వర్షం వస్తే వారం రోజుల వరకూ వంతెనపై నీళ్లు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వంతెనపై గోతులు అంతకంతకు పెరుగుతూ ప్రమాదకరంగా మారాయి. వంతెన పైకి వెళ్లే ప్రదేశం పల్లంగా ఉండి వర్షం నీరు చేరుతోంది. ఈనీటి గుండానే వాహనదారులు వెళ్లడం ఇబ్బందిగా మారింది. వంతెన పక్కనే పెంట కుప్పలు, చెత్తాచెదారం వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వంతెన నిర్వహణకు చర్యలు చేపట్టి, కొంత కాలం సేవలందించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.